బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభం

- గణపవరం శివారులోని వాగుపై రూ.8కోట్లతో ఏర్పాటు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

మునగాల : మండల కేంద్రం నుంచి గరిడేపల్లి మండలంలోని కీతవారిగూడెం వరకు గల ఆర్‌అండ్‌బీ ఆధ్వర్యంలో చేపట్టిన రోడ్డు వెడల్పు పనుల్లో భాగంగా గణపవరం శివారులోని వాగుపై రూ.8కోట్ల వ్యయంతో బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. గత ప్రభుత్వం ఆర్‌అండ్‌బీ రోడ్డును డబుల్‌రోడ్డుగా మార్చేందుకు రూ.20కోట్ల నిధులు మంజూరు చేయగా కాంట్రాక్టర్ నిధులు సరిపోవడంలేదని పనులను మధ్యలోనే వదిలేశాడు. ఈ కారణంతో రోడ్డు పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో ఆర్‌అండ్‌బీ అధికారులు తిరిగి సర్వే చేపట్టి ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపారు. దీంతో అసంపూర్తిగా మిగిలిపోయిన 4.5కిమీ రోడ్డు నిర్మాణానికి మరో రూ.10కోట్లు మంజూరు చేశారు. కాగా ఇదే రోడ్డులో గణపవరం శివారులో ఉన్న వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి గత ప్రభుత్వం రెండేళ్ల క్రితం రూ.8కోట్లు మంజూరు చేసింది. కాని బ్రిడ్జి



గణపవరం శివారులో గల వాగుపై సాగుతున్న బ్రిడ్జి నిర్మాణ పనులు

నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. ఈ రోడ్డు డబుల్‌రోడ్డు కావడంతో బ్రిడ్జి నిర్మాణం తప్పనిసరి అయ్యింది. గతంలో వర్షాల కారణంగా వరదలు వచ్చిన సమయంలో ఈ వాగుపై సుమారు 5అడుగుల వరదనీరు ప్రవహించడంతో వారం రోజుల పాటు రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ రహదారి గుండా నిత్యం మునగాల, గరిడేపల్లి, పెన్‌పహాడ్, చిలుకూరు మండలాలకు చెందిన సుమారు 15గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రస్తుతం డబుల్‌రోడ్డుగా మారనున్న ఈ రోడ్డుపై గణపవరం వద్ద బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే ఆయా గ్రామాల ప్రజల కష్టాలు గట్టెక్కినట్లే. బ్రిడ్జి నిర్మాణపు పనులు వీలైనంత త్వరలో నాణ్యతగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బ్రిడ్జి నిర్మాణంలో నాణ్యత పాటించాలి



గణపవరం శివారులో రూ.8కోట్లతో నిర్మించే బ్రిడ్జి నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి. గతంలో ఈ రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చాలని సీపీఎం ఆధ్వర్యంలో పాదయాత్రతో పాటు ఉద్యమాలు, ఆందోళనలు చేపట్టాం. ఈ ప్రాంత ప్రజల పోరాట ఫలితంగా ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణ పనులకు నిధులు కేటాయించింది. వీలైనంత త్వరలో బ్రిడ్జి నిర్మాణ పనులను పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలి.

– మేదరమెట్ల వెంకటేశ్వరరావు, సీపీఎం నాయకుడు, కొక్కిరేణి

బీజేపీ పాలనలో దేశానికి ప్రత్యేక గుర్తింపు

హుజూర్‌నగర్ : బీజేపీ పాలనలో భారతదేశం ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపు పొందిందని, ప్రధాని మోదీ లాంటి నాయకుడు ప్రపంచలోనే దొరకడని నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ ఎంపీ అభ్యర్థి శానంపుడి సైదిరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొబ్బ భాగ్యరెడ్డితో కలిసి మాట్లాడారు. పదేళ్లుగా దేశం ఎంతో పురోగతి సాధించిందని, అందుకనే ప్రపంచం మన దేశం వైపు చూస్తోందన్నారు. బీజేపీ అంటేనే అభివృద్ధి అనే పేరు వచ్చిందన్నారు. కశ్మీర్‌లో ఆర్టికల్ 370రద్దు, రామాలయం నిర్మాణం, జాతీయ రహదారుల నిర్మాణం దేశప్రగతిని చూపిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ దేశంలో 400సీట్లు గెలువబోతోందని, మూడో సారి మోదీ ప్రధాని అవుతారని ధీమా వ్యక్తం చేశారు. ఆ 400సీట్లలో నల్లగొండ పార్లమెంట్ స్థానం కూడా ఉందన్నారు. జిల్లాకు చెందిన మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి ఉన్నా జిల్లా అభివృద్ధి జరగదని విమర్శించారు. బీఆర్‌ఎస్ పార్టీకి ఎంపీ అభ్యర్థులే కరువయ్యారని, ఆ పార్టీకి ఓటు వేసినా అది వృథా అవుతుందన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు బాల వెంకటేశ్వర్లు, అంబళ్ల నరేష్, పత్తిపాటి విజయ్, గుండెబోయిన వీరబాబు, అంజి యాదవ్, బి.కృష్ణయ్య, ఇంటి రవి, కె.కోటిరెడ్డి, కె.శ్రీనివాస్, యల్లయ్య, అంజయ్య, సత్యనారాయణ, విజయ్, విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి శానంపుడి సైదిరెడ్డి, పక్కన భాగ్యరెడ్డి

నేడు బీజేపీ కార్యకర్తల సమావేశం

నడిగూడెం : కోదాడ పట్టణంలోని పెరిక భవన్‌లో మంగళవారం బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి చిలుకూరి శ్రీను సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి నల్లగొండ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

క్లుప్తంగా

బీజేపీలో పలువురి చేరిక



కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరిన కోదాడ పట్టణ నాయకులు, కార్యకర్తలు

కోదాడఅర్బన్ : పట్టణానికి చెందిన బండారు కవిత అమరేందర్‌రెడ్డి, వివిధ పార్టీలకు చెందిన నాయకులు సోమవారం హైదరాబాద్‌లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. కార్యక్రమంలో బీజేపీ కోదాడ అసెంబ్లీ కన్వీనర్ కనగాల నారాయణ, సీనియర్ నాయకురాలు నూనె సులోచన, వంగవీటి శ్రీనివాసరావు, దొంతగాని వీరబాబు, శ్రీలోజు రమేష్, రామారావు, నడిగూడెం, మునగాల, అనంతగిరి మండలాల నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



ఉపాధి పనులు పరిశీలిస్తున్న జెడ్పీటీసీ జగన్

మఠంపల్లి : మండలంలోని భీల్యానాయక్‌తండా, అంత్యాతండా, బాడవాతండా తదితర గ్రామాల్లో ఉపాధి హామీలో చేపడుతున్న పంట కాలువల పనులను సోమవారం జెడ్పీటీసీ బానోతు జగన్‌నాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధి కూలీలు పెరిగిన వేతనాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సిబ్బంది కూలీలకు మౌలిక వసతులు కల్పించి, 100రోజుల పనులు కల్పించి పెంచిన వేతనాలు వెంటనే అందేలా చూడాలన్నారు. ఆయన వెంట ఉపాధి సిబ్బంది, కూలీలు, తదితరులు ఉన్నారు.

వైభవంగా విగ్రహాల ఊరేగింపు



విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు

నేరేడుచర్ల : మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన కోదండ రామాలయంలో ప్రతిష్ఠించే ఉత్సవమూర్తుల విగ్రహాలను సోమవారం వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. ఈనెల 19, 20, 21తేదీల్లో విగ్రహాల ప్రతిష్ఠామహోత్సవం నిర్వహించనున్న నేపథ్యంలో తిరుపతి నుంచి కృష్ణశిలతో ఆకర్షణీయంగా మలిచిన కోదండరాముడు, సీతాదేవి, లక్ష్మణుడు, ఆంజనేయుడి విగ్రహాలను పట్టణంలో మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పట్టణ పుర ప్రముఖులు, భక్తులు తదితరులున్నారు.

గడ్డివాము దగ్ధం

మునగాల : మండల కేంద్రానికి చెందిన తూముల వీరస్వామి తన ఇంటి ఎదురుగా వరిగడ్డిని వాముగా ఏర్పాటు చేసుకున్నాడు. సోమవారం ప్రమాదవశాత్తు గడ్డివాముకు నిప్పుఅంటుకోవడంతో ఒక్కసారిగా మంటలు లేచాయి. దీంతో పరిసర ప్రాంతాల వారు విద్యుత్ మోటార్ల సాయంతో మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అదే విధంగా కోదాడ అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. అప్పటికే సుమారు 500మోపుల గడ్డి పూర్తిగా దగ్ధమైంది. సమయానికి మంటలు అదుపుచేయడంతో పక్కన ఉన్న ఇళ్లకు ఎటువంటి ముప్పు జరగలేదు. దగ్ధమైన గడ్డి విలువ సుమారు రూ.50వేల వరకు ఉంటుందని బాధితుడు తెలిపారు.

బీజేపీకి వ్యతిరేకంగా పోరాడుతుంది కమ్యూనిస్టులే

హుజూర్‌నగర్ : బీజేపీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుతుంది కమ్యూనిస్టులే అని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పాండు అన్నారు. సోమవారం పట్టణంలో నిర్వహించిన పార్టీ పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో బీజేపీని ఎదుర్కొనేందుకు కమ్యూనిస్టులు ముందున్నారన్నారు. దేశంలో జరగబోతున్న ఎంపీ ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు అన్ని వర్గాల ప్రజలు, పార్టీలు ఏకం కావాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు పల్లె వెంకటరెడ్డి, దుగ్గి బ్రహ్మం, శీలం శ్రీను, యోన, మురళీకృష్ణ, వెంకటేశ్వర్లు, వీరమల్లు, వెంకటనారాయణ, నాగేశ్వరరావు ఉన్నారు.

ఐరిష్ విధానాన్ని ప్రవేశపెట్టాలి

హుజూర్‌నగర్ : వేలిముద్రలు పడని భవన నిర్మాణ కార్మికులకు ఐరిష్ విధానాన్ని తక్షణమే ప్రవేశపెట్టాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యల్క సోమయ్య అన్నారు. సోమవారం పట్టణంలోని యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రోజూ పనిచేసే భవన నిర్మాణ కార్మికుల చేతి వేళ్ల అరుగుదలతో మీసేవా కేంద్రాలకు వెళ్తే వేలిముద్రలు పడటం లేదన్నారు. దీంతో వారు కొత్త కార్డు, రెన్యువల్ పొందలేక పోతున్నారని అన్నారు. వారి కోసం ఐరిష్ విధానాన్ని తక్షణమే ప్రవేశపెట్టాలని ఆయన కోరారు. సమావేశంలో సంఘం నాయకులు వి.నరేష్, వెంకన్న, రాంబాబు, ముస్తఫా, రాములు, రామకృష్ణ, వెంకన్న, పద్మ, రోజమ్మ పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

పాలకవీడు : రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ భూక్యా గోపాల్ అన్నారు. సోమవారం మండలంలోని గుండెబోయినగూడెం శివారులో కృష్ణానదిపై కొనసాగుతున్న లిఫ్ట్ నిర్మాణ పనులను ఆయన స్థానిక జెడ్పీటీసీ మాళోతు బుజ్జి మోతీలాల్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడారు. సాగర్ ఎడమకాలువ జాన్‌పహాడ్ మేజర్ పరిధిలోని ఆయకట్టు చివరి భూములకు సాగునీరు అందించాలనే సంకల్పంతో రూ.118.70కోట్లతో చేపట్టిన సాగునీటి లిఫ్ట్ నిర్మాణ పనులు కొంతకాలంగా నిలిచిపోయాయని, సమస్యను ఇటీవల నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకుపోవడంతో స్పందించిన మంత్రి లిఫ్ట్ పునరుద్ధరణ పనులను చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. లిఫ్ట్ నిర్మాణం పూర్తైతే సుమారు 5వేల ఎకరాలకు పైగా సాగునీరు అందుతుందన్నారు. త్వరలో మంత్రి ఉత్తమ్ లిఫ్ట్ నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించనున్నట్లు తెలిపారు. వారి వెంట స్థానిక రైతులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



పనులను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు

ప్రభుత్వ ఆస్పత్రిలో పండ్లు, బ్రెడ్ పంపిణీ



కోదాడరూరల్ : ఆస్పత్రిలో పండ్లు, బ్రెడ్ పంపిణీ చేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, తదితరులు

కోదాడరూరల్ : రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డిల పెళ్లిరోజు వేడుకలను సోమవారం కోదాడ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కోదాడ పీఏసీఎస్ చైర్మన్ ఓరుగంటి శ్రీనివారెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు, బాలింతలకు పాలు, పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రి ఉత్తమ్, పద్మావతి దంపతులు హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల ప్రజలే తమ బిడ్డలుగా భావిస్తూ ఈ రెండు ప్రాంతాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బుడిగం నరేష్, డైరెక్టర్ శిరంశెట్టి వెంకటేశ్వర్లు, ఎండీ రఫీ తదితరులు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు అన్నదానం

హుజూర్‌నగర్ : రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి పెళ్లిరోజు సందర్భంగా సోమవారం పట్టణంలో యూత్ కాంగ్రెస్ నాయకులు అనాథ పిల్లలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జునరావు, యూత్ కాంగ్రెస్ నాయకులు కె.మహేష్, హరికృష్ణ, వెంకన్న, సందీప్, వార్డెన్ పాల్గొన్నారు.

కనులపండువగా బొడ్రాయి వార్షికోత్సవం

కోదాడఅర్బన్ : పట్టణంలో శీతలమాత, నాభిశిల (బొడ్రాయి) ఆరో వార్షికోత్సవాన్ని సోమవారం కనులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచి పట్టణంలోని మహిళలు బోనాలతో వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అదేవిధంగా జలాభిషేకాలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం గ్రామస్తులు ఆవుల రామారావు, పైడిమర్రి వెంకటనారాయణ మాట్లాడారు. పట్టణంలో ఆరు సంవత్సరాలుగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బొడ్రాయి పున ప్రతిష్ఠ కమిటీ, ముత్యాలమ్మ కమిటీ, సభ్యులు భక్తులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నీటిఎద్దడి లేకుండా సత్వర చర్యలు



పైపులైన్ పనులను పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీనివాస్

నేరేడుచర్ల : మున్సిపాలిటీలోని అన్నివార్డుల్లో నీటి ఎద్దడి లేకుండా సత్వర చర్యలు తీసుకోవాలని హుజూర్‌నగర్ ఆర్డీఓ వి.శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. సోమవారం మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో చేపట్టిన మంచినీటి పైపులైన్ల మరమ్మతు పనులను ఆయన ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. మున్సిపాలిటీలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడు మంచినీటి సరఫరా లైన్లు, చేతి పంపులు, మోటార్లకు మరమ్మతులు చేయించాలన్నారు. నీరు రాని ప్రాంతాల్లో వాటర్ ట్యాంకుల ద్వారా మంచినీటి సరఫరా చేయాలని ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎ.అశోక్‌రెడ్డి, ఏఈ స్వాతి తదితరులున్నారు.

గ్రామాల్లో ఫైలేరియాపై ఇంటింటి ప్రచారం

నడిగూడెం : ఫైలేరియా పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని త్రిపురవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజర్ గుర్రం విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని సిరిపురంలో త్రిపురవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఫైలేరియాపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామంలో నాలుగు బృందాలుగా ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో పల్లె దవాఖానా వైద్యాధికారి స్రవంతి, సిబ్బంది విజయకుమారి, రమ, శ్రీదేవి, ఆశకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

జక్కుల వీరయ్యకు సన్మానం



వీరయ్యను సన్మానిస్తున్న నాయకులు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా ఇటీవల ఎన్నికైన జక్కుల వీరయ్యాయాదవ్‌ను చింతలపాలెం మండల యాదవ సంఘం సభ్యులు సోమవారం పట్టణంలో సన్మానించారు. కార్యక్రమంలో ఆంజనేయులు, పోలేడి శ్రీనివాసరావు, పెరుగు సుబ్బారావు, పి.నరసింహారావు, వై.నరసింహారావు, చిర్ర శ్రీనివాసరావు, ఫ్రాన్సిస్, రామారావు, వై.సైదేశ్వరరావు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీనృసింహుడి నిత్యకల్యాణం

మఠంపల్లి : మండలంలోని మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని సోమవారం అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిత్యహోమం పూర్తిగావించి శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలంకరణతో అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవాన్ని రక్తిగట్టించారు. కాగా క్షేత్రంలోని శివాలయంలో గల శ్రీపార్వతీ రామలింగేశ్వరస్వామికి ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు అద్దేపల్లి లక్ష్మణాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, లక్ష్మీనరసింహ మూర్తి, ఫణి భూషణ మంగాచార్యులు భక్తులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

హుజూర్‌నగర్ : రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ శ్రీనివాసులు అన్నారు. సోమవారం హుజూర్‌నగర్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు తమ ధాన్యాన్ని తూర్పార బట్టి తేమ శాతం 17కు మించకుండా కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగార్జునరెడ్డి, ఏఓ స్వర్ణ, ఏపీఓ స్వరూపరాణి, ఏఎంసీ కార్యదర్శి మల్లేశం, అంజయ్య, కార్యదర్శులు నరేందర్‌రెడ్డి, జనార్దన్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మునగాల : మండలంలో ప్రాథమిక సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ అన్నారు. సోమవారం మునగాల ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో మండలంలోని బరాఖత్ గూడెంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతాంగం ధాన్యాన్ని ఆరబెట్టుకొని కేంద్రాలకు తీసుకురావాలన్నారు. గ్రేడ్–ఏ ధాన్యానికి రూ.2203లు, బి–గ్రేడ్‌కు రూ.2183లు ప్రభుత్వం మద్దతు ధర అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.రమేష్ దీనదయాళ్, తహసీల్దార్ వి.ఆంజనేయులు, వ్యవసాయ విస్తరణాధికారి షేక్ ముస్తఫా, పీఏసీఎస్ సిబ్బంది బసవయ్య, సుందరయ్య, చింతకాయల ఎల్లయ్య, కాసాని గోపి, తాళ్లపాక వెంకటేశ్వర్లు, శారద తదితరులు పాల్గొన్నారు.



హుజూర్‌నగర్ : ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసులు

చిలుకూరు : మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం తహసీల్దార్ ధ్రువకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ మంత్రిప్రగడ సీతారామచందర్‌రావు, ఏపీఎం దుర్గాప్రసాద్, సీసీలు కందుకూరి గురుమూర్తి, స్వరూప, కోటేశ్వరి పాల్గొన్నారు.

మోతె : రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మండల తహసీల్దార్ కె.సంఘమిత్ర అన్నారు. సోమవారం మండల కేంద్రంతో పాటు మండలంలోని మామిళ్లగూడెం ఐకేపీ కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకుని మద్దతు ధర పొందాలన్నారు. ప్రభుత్వం అందించే మద్దతు ధర మొదటి రకం క్వింటాకు రూ.2,203లు, రెండో రకం ధాన్యం ధర క్వింటాకు రూ.2,183 అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏపీఎం వెంకయ్య, సీసీలు, మహిళా సంఘాల సభ్యులు, వీఓలు, రైతులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ సర్వారం ఆధ్వర్యంలో..

మండలంలోని సర్వారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఉర్లుగొండ, నేరడవాయి, తుమ్మగూడెం గ్రామాల్లో సోమవారం రావిపహాడ్ క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి ఉయ్యాల కార్తీక్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్వారం బ్యాంక్ సీఈఓ దోసపాటి ఉపేందర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



చిలుకూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ ధృవకుమార్



మోతె : ఉర్లుగొండలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఈఓ



మునగాల : బరాఖత్‌గూడెంలో కేంద్రాలను ప్రారంభిస్తున్న ఆర్డీఓ సూర్యనారాయణ

కొనసాగుతున్న విగ్రహాల ప్రతిష్ఠ ఉత్సవాలు

గరిడేపల్లి : మండలంలోని సర్వారం గ్రామంలో శ్రీ సీతారామచంద్ర, లక్ష్మణ, అభయాంజనేయ, గణపతి, శిఖర, కీర్తిధ్వజ, కోటమైసమ్మ, కట్టమైసమ్మ, సత్తెమ్మ, పోతురాజు విగ్రహాల ప్రతిష్ఠ ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం భక్తులు పలు పూజలు నిర్వహించారు. పురోహితులు ద్రోణ సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో రాయప్రోలు శ్రీరామయ్యశర్మ, రాల్లబండి రాజశేఖర్‌శర్మ బృందంచే సుప్రభాత సేవ, గణపతిపూజ పుణ్యాహవచనం, మృతుంగ్రహనం, అగ్నిమధున, మహాలింగార్చన, విగ్రహాలు గ్రామాలో ఊరేగింపు, సర్వతో భద్ర మండప పూజలు, మూలమంత్ర హోమాలు గ్రామస్తులచే విశేషంగా నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న భక్తులు

ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడించాలి



సమావేశంలో మాట్లాడుతున్న యాకూబ్

గరిడేపల్లి : మతోన్మాద బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని సీపీఎం మండల కార్యదర్శి ఎస్‌కె యాకూబ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని కీతవారిగూడెంలో సీపీఎం ప్రజా సంఘాల సమావేశాన్ని బొల్లెపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కమ్యూనిస్టులు బలహీన పడటం మూలాన దేశం ఆర్థికంగా వెనకబడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వామపక్షాలు బలంగా ఉంటే రైతులకు గిట్టుబాటు ధర నిరుద్యోగ సమస్య అందరికీ విద్యా, ఉద్యోగం అందుబాటులో ఉండేవన్నారు. ఈ దేశానికి ఎర్రజెండాలు మాత్రమే పరిష్కారం చూపగల సత్తా దమ్ము ఉంటుందన్నారు. సమావేశంలో నాయకులు తుమ్మల సైదయ్య, రాచమళ్ల రామస్వామి, బొల్లెపల్లి శ్రీనివాస్, బొమ్మకంటి వెంకయ్య, ఇండ్ల శ్రీనివాస్, దొంతగాని వెంకటేశ్వర్లు, జుట్టుకొండ మట్టయ్య, వెంకటేశ్వర్లు, వెంకన్న, లక్ష్మయ్య, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలి

నేరేడుచర్ల : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 104 ఉద్యోగుల వేతనాలను తక్షణమే చెల్లించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు డి.ధనుంజయనాయుడు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 20ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో విధులు నిర్వర్తిస్తూ ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రతి నెలా జీతాలు చెల్లించకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. ఐదు నెలలుగా జీతాలు రాకపోవడంతో వారి బాధలను పట్టించుకునే వారు లేరన్నారు. ఆయన వెంట తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రావుల సత్యం, ఏఐఎస్‌ఎఫ్ నాయకులు కోమట్రాజ్ వెంకట్ తదితరులున్నారు.

చేపల చెరువులో విషప్రయోగం

మునగాల : మండలంలోని తాడువాయి శివారులో గల ఎర్రచెరువులో గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం అర్ధరాత్రి విషప్రయోగం చేశారు. దీంతో చెరువులోని నాలుగు టన్నుల చేపలు మృత్యువాత పడినట్లు మత్స్యసహకార సంఘం కార్యదర్శి కోల ఉపేందర్‌రావు సోమవారం తెలిపారు. మృత్యువాత పడిన చేపల విలువ సుమారు రూ.4లక్షల వరకు ఉంటుందని, ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు హృతిక్, నవీన్‌తో ఉపాధ్యాయుడు

కోదాడ : జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న ఫిట్ ఇండియా క్విజ్ పోటీలకు తెలంగాణ రాష్ట్రం నుంచి కోదాడలోని తేజ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన పోటీల్లో పాఠశాలకు చెందిన విద్యార్థులు హృతిక్, నవీన్ పాల్గొని మొదటి స్థానంలో నిలిచి రాష్ట్రం తరపున జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రూ.2.5లక్షల నగదు బహుమతిని అందజేస్తారు. త్వరలో ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో విజయం సాధించిన జట్టుకు రూ.35లక్షల నగదు బహుమతిని నిర్వాహకులు అందజేస్తారని, తమ విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతి సాధిస్తారని పాఠశాల నిర్వాహకులు రమాసోమిరెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

గుర్తింపుకార్డులు కలిగి ఉండాలి

హుజూర్‌నగర్ : భవన నిర్మాణ కార్మికులు వెల్ఫేర్ బోర్డు మంజూరు చేసే గుర్తింపు కార్డులు కలిగి ఉండాలని ఆ సంఘం అధ్యక్షుడు షేక్ సైదా అన్నారు. సోమవారం పట్టణంలోని టౌన్‌హాల్లో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, వినాయకరావు, ఏలియా, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పంచగవ్య వైద్యంపై అవగాహన సదస్సులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని సాయిబాబా కల్యాణ మండపంలో జాతీయ పంచగవ్య వైద్యం, ఆర్గానిక్ వ్యవసాయం, ధ్యానంపై ఈనెల 26, 27, 28తేదీల్లో అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు ఆయుర్వేద వైద్యులు రంగాచార్యులు, సతీష్‌రెడ్డి, గోవనం ట్రస్ట్ డైరెక్టర్ బేతం రామాంజిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో పాల్గొనే వారు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 8328250877ను సంప్రదించాలన్నారు.

విద్యార్థులకు గోల్డ్, సిల్వర్ మెడల్స్

నడిగూడెం : మండల కేంద్రంలోని శ్రీసాయి పబ్లిక్ స్కూల్‌కు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు అబాకస్‌లో గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించినట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ బుస్సా సులోచన తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పాఠశాలకు చెందిన రిషిత, ముకేష్, దీక్షిత, వృషిత్ గోల్డ్‌మెడల్స్ సాధించగా, మోక్షిత్‌సాయి, పనేత్ర, శ్రీజ, ఇందు సిల్వర్‌మెడల్స్ సాధించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు అభినందించారు.

కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా జోజి

మఠంపల్లి : మండలంలోని రఘునాథపాలెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు మాతంగి జోజి కాంగ్రెస్ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సోమవారం ఆయనకు నియామకపత్రం అందజేశారు. మాజీ ఎంపీపీ తిరుమలశెట్టి అప్పయ్య, పీఏసీఎస్ చైర్మన్ జవ్వాజి రామచంద్రయ్య, ఎంపీటీసీ కె.చెన్నయ్య నాయకులు జోజిని శాలువాతో సన్మానించారు.

మోసం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం

నడిగూడెం : కేంద్ర ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేస్తుందని కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి వేపూరి సుధీర్ ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలోని అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాల ఎదుట నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో యెలుగూరి నాగరాజు, జూలూరి వీరాచారి, కాసాని గోపీనాథ్, గుంజ మురళి, రవి, విజయ్, వంశీ, శ్రీకాంత్, దినేష్, మహేష్ పాల్గొన్నారు.